# ఆశలు - ఆశయాలు

★


రచన :

శ్రీమతి ఆర్. వసంత రామానుజం.


(గత సంచిక తరువాయి)

భుజంగరావు "శేఖర్! నాగురించి చాలామంది నన్ను కర్కోటకుడని, దుర్మార్గుడని, ఎందరో నన్ను తిడుతూ వున్నారు కాని, వాటినిగురించి అనుకోవడంలేదు. ఉద్యోగ ధర్మాన్ని నా హోదాకు తగిన విధంగా నెర వేరుస్తున్నానే కాని. యింటియందు నా ఆశలు ఫలించ లేదు." అని భాధగా చెప్పసాగాడు.

శేఖర్ "మీకు ఏం తక్కువ వచ్చింది. ఎందుకలా బాధపడిపోతున్నారు? అని విచారాన్ని తెలియ జేశాడు."

"శేఖర్! నాకు అన్నివున్నా ఏదో లోటుగానే కనిపిస్తూవుంది. జీవితంలో వుద్యోగ రీతిగా నాకు ఏబాధ లేదు. కాని యింటియందు నా ఆశలను భగవంతుడు తీర్చలేకపోయాడు. నీతో చెప్పకుండాపోతే మరి ఎవరితో చెప్పాలి. ఇలాగైనా నా మనసులోని భారాన్ని దించినట్లు, కొంత బాధ తగ్గుతుంది." అని చెప్పసాగాడు. శేఖర్ వాచిలోని టైంచూసుకున్నాడు రాత్రి 8-10 ని॥లు అయింది.

"నాకు పెండ్లి అయిన రెండు సం॥లకే ఒక అమ్మాయి కలిగింది. నా భార్య బలహీనంగా, నీరసంగా వుండబట్టి మొదటి కాన్పు ఆపరేషన్ చేయవలసి వచ్చినది. మొదట కాన్పులో ఆడబిడ్డ పుట్టింది. సుధా అని పేరుపెట్టి ఎంతో అల్లారు ముద్దుగా పెంచుతూవచ్చాము. సుధ తర్వాత నా భార్యకు పిల్లలు కలుగలేదు. ఎందుకో దేవునికి కూడా మామైన దయకలుగలేదు. ఒక్క కూతురుని యిచ్చి కుటుంబ నియంత్రణను దేవుడు పాటించే విధంగా అనుగ్రహించాడు.

సుధను చూచుకొని మేము చాల సంతోషపడిపోయాము. కాని నాభార్యకు ఒక్క కొడుకు పుడితే బాగుండునని చెప్తూ వచ్చేది.

సుధ పెరిగి పెద్దదై BA దాక చదువుకున్నది. నిజం చెప్పాలంటే సుధ పుట్టిన తర్వాత నాజీవితంలో ఒకొక్క మెట్టుగా ఉద్యోగంలో పైకి రాగలిగాను. మంచి అందగాడు, బుద్ధిమంతుణ్ణి చూచి సుధకు పెండ్లి చేశాము. కాని అతను వుద్యోగ రీతిగా తన భార్య సుధను పిల్చుకొని చాలా దూరంలో ట్రాన్స్‌ఫర్ అయి వెళ్ళిపోయాడు. సుధభర్త కుమార్ చాలా మంచి వాడే కాని, ఉద్యోగ ధర్మాన వెళ్ళవలసి వచ్చింది.

సుధ తర్వాత నాకు పిల్లలు లేనికారణగా నాయిల్లు శిథిలమైన దేవాలయంలాగ వుండిపోయింది. ఇంటికి వస్తే ఏదో పోగొట్టుకొన్న వాడిగా బాధపడుతూ వుండి పోయే వాణ్ణి.

ఇలాగ 6 సం॥లు గడిచింది. మొన్న సంక్రాంతికి కూతురు, అల్లుణ్ణి, నా మనవడు మనవరాలను రమ్మని వుత్తరం వ్రాశాను. వాళ్ళుకూడా నా మాట కాదన కుండా ఆరు సం॥లు తర్వాత వచ్చారు.

సుధకు ఇద్దరు కూతుర్లు వనజ, గిరిజ, కుమారుడు చంద్రం. ఈ ముగ్గురికే సుధ కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేసుకున్నది. పిల్లలు చూడ ముచ్చటగా వనజ, గిరిజ యిక్కడ వున్నన్ని రోజులు నాతో ఆడుకుంటూ "తాతయ్యా! తాతయ్యా!" అంటు నాతోబాటు వుండి పోయారు. నా మనవడు చంద్రంకు రెండు సంవత్సములు. ఒక రోజు నేను క్రింద కూర్చొని మనవరాళ్ళతో యిదే విధంగా బొమ్మలతో ఆడుతూవుండగా 2 సం: చంద్రం నాకు తెలియకుండా సోఫా మీద నుండి నా బుజాల మీద ఎక్కి కూర్చొన్నాడు.

మా అమ్మాయి సుధ కోపంతో "తాతయ్యా మీద ఎక్కి కూర్చొంటవా?" అని అంటు వుంటే "ఎందుకమ్మా కోపగించుకుంటావు నా మనవడేగా ఎక్కి కూర్చొన్నది" అని లాలించాను. అందాక నా బుజాల మీద కూర్చొన్నది కూడా నాకు తెలియలేదు.

ఇలాగ నాయింటిలో సంక్రాంతి పుణ్యమా, అంటూ పిల్లలతో కళకళ లాడసాగింది. నేను బజారు నుండి కావలసినవన్ని బొమ్మలు తీసుకవచ్చి వారితో ఆట్లాడు కుంటూ వుండేవాణ్ణి.

ఆ సంతోషం కూడా నీటి బుడగలాగ కరగి పోయింది. నా సుధ, మనవరాలు, మనవడు, అల్లుడు

వెళ్ళిపోయారు.

ఆనాటి నుండి నాకు మనసులో బాధ ఆవరించింది. ఆఫీసునుండి యింటికి రాగానే యీ బొమ్మలు నన్ను వెక్కిరిస్తునట్లు నా చంద్రం, వనజ, గిరిజ వాళ్ళు యింక మీదట రారని చెప్తున్నట్లు అగుపించేది అని బాధగా కన్నీళ్ళు తుడుచుకున్నాడు భుజగరావు.

అలా అంటూవుంటే శేఖర్ కూడా బాధగా "విచారించకండి సార్! భగవంతుడు మనసువున్న చోట మనుష్యులను వుంచడు. కాని మీ మంచి మనసే వారిని కాపాడుతూవుంటుంది" అని టైం చూసుకొని "సార్!......" అని చెప్పడానికి సందేహించాడు.

"చెప్పు శేఖర్! ఏమైనా డబ్బు కావాలా? ఏదైనా పనివుందా?" అని చెప్పాడు.

శేఖర్ యింటినుండి వచ్చిన వుత్తరం చేతికియిస్తూ "సార్ మీలాగే ఒక కూతురైన రాధకు విషజ్వరం అని నా భార్య వుత్తరం వ్రాసింది. ఉదయం నుండి మీదగ్గర సెలవు తీసుకొని వెళ్ళాలని ప్రయత్నిస్తున్నాను కాని పనిమీద పనులు వుండబట్టి అడగలేకపోయాను. దయ చేసి నాలుగు రోజులు సెలవు యిచ్చారంటే నా రాధను బ్రతికించుకుంటాను" అని అంటూవుండగా కండ్ల నుండి జలజల కన్నీళ్ళురాలింది.

భుజంగరావు, శేఖర్ బుజాన్ని తడుతూ "బాధ పడకు శేఖర్ నీమంచి మనసే మీ అమ్మాయి రాధను బ్రతికిస్తుంది." అని టైంచూసి "అరే 9-30 గంటలు కావస్తుంది. 10-30 గంటలకు విజయవాడకు ట్రైన్ వుంది. ఒక గంటలో ఎలా యింటికివెళ్ళి బెడ్డింగు సర్దుకొని వెళ్ళగలవు" అని అంటూవుండగా డ్రైవరు భీమన్న లోనికి వచ్చి "సార్! నేను యింటికి వెళ్ళతాను" అనిచెప్పాడు.

భుజంగరావు "భీమన్న! శేఖర్‌ను ఒక మంచి హోటల్ వద్ద భోజనం చేయించి వారి యింటికి తీసుకవెళ్ళి అతని సామాన్లుతో స్టేషన్‌వద్ద 10-30 గం. హౌరా ఎక్స్‌ప్రెస్‌కు వెళ్ళే విధంగా స్టేషన్‌కు తీసుక వెళ్ళు" అన్నాడు. భీమన్న "అలాగే సార్!" అన్నాడు.

భుజంగరావు శేఖర్ వైపు తిరిగి "శేఖర్! ఈ మాట ఆఫీసులో చెప్పివుంటే ఎంతో బాగుండేది. నీలాంటి వర్కరుకు సహాయం చెయ్యకపోతే మరెవరికి చేస్తాను. నీవు రాధకు బాగుగా అయ్యేంతవరకు వుండి తర్వాత డ్యూటీలోవచ్చిచేరు. ప్రస్తుతానికి యీరెండు వందలు తీసుకొని వూరికి వెళ్ళు" అని డబ్బు యివ్వబోయాడు.

ఆనందంతో శేఖర్ నమస్కరిస్తూ "చాలుసార్! ఇంతటి అభిమానంవుంటే అదే వేలువేలుగా డబ్బులు ఇచ్చినట్లు, డబ్బులువుంది. వెళ్ళొస్తానని" లేచాడు. భుజంగరావు బలవంతాన రెండొందలు శేఖర్ జేబులో వుంచి "సంతోషంగా వెళ్ళిరా!..." అని సాగనంపాడు.

శేఖర్ ఆనందంతో వెళ్ళుతూవుంటే భుజంగరావు "ఒక మంచి హృదయము గలవానికి సహాయము చేశాననే సంతోషంతో మనసులోనే భగవంతుడా! శేఖర్ కుమార్తె రాధకు ఏ ప్రమాదం రాకుండా కాపాడు "అని దేవుని ప్రార్థించాడు."...

ఈ విధంగా మన మేనేజరు భుజంగరావు మనల్ని తీర్చి దిద్ది మనకు ఎంతో సహాయంచేశారు. మన మందరము ఇలాగ చల్లగ వుంటున్నామంటే వారి చల్లని ఆదరణయే కారణం. ఇప్పుడు చెప్పండి మనల్ని మంచి దారికి తెచ్చి, మన కంపెనీ భవిష్యత్తును, అందరిని, తీర్చి దిద్దిన బుజంగరావు వెళ్ళిపోతూవుంటే మనకందరికీ సంతోషమేనా? వారి సీటుకు నన్ను ప్రమోషన్ యిస్తేను నేను కూర్చోనలేను.

ఎల్లప్పుడూ...

ఎమరాల్డ్ బనియన్లనే ఉపయోగించండి.




26, Stanes Rd., 4th St.,
TIRUPUR - 638602
Regd. No. 300188

బుజంగరావువంటివాళ్ళు తన ఆశయాలలో కంపెనీ అభివృద్ధి తెచ్చేవాళ్ళు ఏకోటికి ఒక్కరు వుంటారు. అటువంటి వాళ్ళను వదులుకోవలసిందేనా? అని శేఖర్ ఆవేశంతో చెప్తూవుంటే ఆఫీసుస్టాఫు వాళ్ళు అందరు బొమ్మలాగ కూర్చొని చూస్తూవుండిపోయారు.

రెండు నిముషాలు తర్వాత డిస్పాచ్ క్లర్కు రవి కుర్చీ నుండి లేచి "మిష్టర్ శేఖర్! మన మేనేజరు బుజంగరావు మనల్ని, నన్ను, యీకంపెనీని తీర్చి దిద్దారు. వారు మనకంపెనీనుండి, మనల్ని వదలి వెళ్ళి పోతూవుంటే నాకేకాదు, మన ఆఫీసులో ప్రతిఒక్కరికి బాధగావుంది. కాని...కాని...మన బాస్, డైరక్టర్సు బుజంగరావు వెళ్ళిపోతూ వుంటెవారు కూడ అనుమతించారు. ఆస్థానంలో మిమ్మల్ని మేనేజరుగా అపాయింటు చేశారు. మనం మాత్రం ఏమి చెయ్యగలము" అని బాధగా తెలిపాడు.

"ఎందుకు చెయ్యలేము మనం అందరు కలసి బాస్‌ను డైరక్టర్సును మా మేనేజరు మాకు కావాలి అని అడిగితే? మనల్ని వదలివెళ్ళలేరుకదా! మధ్యాహ్నం డైరక్టర్సు మీటింగువుంది. అప్పుడు బాస్ మేనేజరు బుజంగరావు, అందరువుంటారు. అందరుపోయి అడుగుదాం" అని శేఖర్ అంటూవుంటే—

అందరు ఏక కంఠంతో "శేఖర్ మీతోబాటు మేము వస్తాము మాకు మా మేనేజరు కావాలి" అన్నారు.

అందరు అలా అంటూవుంటే శేఖర్‌కు ఎక్కడలేని వుత్సాహం వచ్చినట్లు అగుపించింది. "డియర్ ఫ్రెండ్స్! మీరు అందరు అలా అంటూవుంటేనాకు చాలా సంతోషంగావుంది. తప్పకుండా మనమేనేజరు మనల్ని వదలి వెళ్ళిపోరనే నమ్మకం వుంది" అన్నాడు శేఖర్.

ఆరోజు మధ్యాహ్నం మరల మీటింగు జరుగుతూ వున్నది. పదిమంది డైరక్టర్సు ప్రక్కన మేనేజరు బుజంగరావు బాస్‌కూర్చొని ఏదో ముఖ్యమైన విషయం గురించి చర్చించుకుంటూ వచ్చారు.

ఇంతలో ఫోన్ మ్రోగడం వలన బాస్ టేబుల్ మీది ఫోను తీసుకొని రెండు నిముషాలు విని "సరే! అందరిని లోపలకు పంపండి" అన్నాడు.

మరో రెండు నిముషాల్లో ఆఫీసులో పనిచేసేవాళ్ళు అందరు శేఖర్‌తో కూడ లోనికి వచ్చారు. డైరక్టర్సుతో మాట్లాడుతూ వున్న బుజంగరావు "ఏమిటి శేఖర్! అందరు యిలావచ్చారు?" ఆశ్చర్యంతో అన్నాడు.

శేఖర్ తన యజమానియైన బాస్‌కు, మిగత పదిమంది డైరక్టర్లకు నమస్కారం చేశాడు. "డియర్ జంటిల్ మెన్! మా మేనేజరు మాకు కావాలి. వారి ఆశయాలతో మన డిపార్టుమెంటు లోని ప్రతి ఒక్కరు మంచి దారిలోనికి వచ్చారు. ఆఫీసు ప్రగతికి కూడ పూలబాటను వేశారు. అటువంటివారు లేకపోతే మేము పనిచేయలేము" అని అంటూవుంటే....

అందరు ఏకకంఠంతో "అవును పనిచేయలేము. మాకు మా మేనేజరు కావాలి" అన్నారు.

శేఖర్ బాస్‌వైపు తిరిగి "సార్! మా మేనేజరును మాకు దక్కించండి" అని ప్రాధేయ పూర్వకముగా ప్రార్థించాడు.

బాస్ ఒక నిముషం ఆలోచించి "మిష్టర్ శేఖర్! బుజంగరావు గురించి నాకన్న మీకు బాగా తెలుసు" ఎందుకంటే ఉదయంనుండి సాయంత్రం దాక మీ మంచి చెడ్డలు చూస్తూ వచ్చారు. వారు సాధించినవి ఆఫీసు తరపున అందరికి తెలుసు, మన ఆఫీసు వ్యాపారరీతిగా వారి వలన ఎంతో అభివృద్ధి చెందినది. 6 సంవత్సరముల క్రిందట మన ఆఫీసు 3 బ్రాంచీలుగా వుండినది. ఇప్పుడు వారి వలన 10 బ్రాంచీలు తెరువబడి, ఎంతో అభివృధి లోని తీసుక వచ్చారు. అటువంటి మంచి వారిని పోగొట్టుకోవడం అంటె, మీకన్న నాకు, చాలా విచారంగా వుంది.

వారే తనకు విశ్రాంతి కావాలని, మానసికంగా తాను బాధపడుతున్నానని; రిటైర్ మెంటు అడిగారు. అదియును గాక "తనకు తర్వాత, తనసీటుకు, బుద్ధిమంతుడు, మంచివాడు, చురుకైన వాడైన నిన్ను అపాయింటు చెయ్యమని చెప్పారు. అందువలన అలాచేశానే కాని మరేకారణాలు కావు. బుజంగరావు వెళ్ళుతున్నారంటే ఒక విలువైన వ్యక్తిని మనము కోల్పోతున్నామని నాకు చాలా బాధగా వుంది" అని తన విచారాన్ని తెలియజేశాడు.

(సశేషం)